గిరిజనులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: స్థానిక డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఖండ్రూమ్ పంచాయతీ కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వ్యాధులతో బాధపడుతున్న వ్యాదిగ్రస్తులకు వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి వైద్య సేవలను అందించారు. ఈ శిబిరానికి స్థానిక పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి పాల్గొని మాట్లాడుతూ, గ్రామాల్లో వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు నిర్వహించి గిరిజనులకు వైద్య సేవలు అందించడం చాలా మంచిదన్నారు. మారుమూల గ్రామాల గిరిజనులు అనేకమంది వైద్య సేవలు చేయించుకోవడానికి హాస్పటల్‌కు వెళ్ల లేక పోతున్నారని, ఇటువంటి వైద్య శిబిరాలతో గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శౌరి పాల్గొన్నారు.

పరీక్షిస్తున్న వైద్యులు

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి

-సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ -ఘనంగా పర్యాటక దినోత్సవం

ప్రజాశక్తి-పాడేరు: దేశంలోనే కాదు ప్రపంచంలోనే మంచి పర్యాటక ప్రాంతాలు మన జిల్లాలో ఉన్నాయని, వాటి అభివృద్ధికి నిరంతర కృషి చేయడం మనందరి బాధ్యతని పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురష్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో పర్యాటక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ముస్సోరిలోని ఐఎఎస్ అకాడమీలో శిక్షణ పొందానని, అక్కడి కంటే ఇక్కడ మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని తెలిపారు. పచ్చని చెట్లు, మంచు అందాలు, గిరిజన సంప్రాదాయాలు మంచి అనుభూతిని కలిగించాయన్నారు.పర్యాటకం అభివృద్ధికి ఇక్కడ అనుకూల వాతావరణం ఉందని, దీంతో, ప్రత్యక్ష, పరోక్షంగా ఉఫాది అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

డిఆర్ఓ బి.పద్మావతి మాట్లాడుతూ, జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు నిత్యమూ పర్యాటకులతో సందడిగా ఉంటున్నాయని, పర్యాటకులకు కనీస మౌలిక సదుపాయాలు వసతి కల్పించడంతో వారిని మరింత ఆకర్షించ వచ్చని తెలిపారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 27న పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్య్రమాలు అతిథులను, ఆహుతులను అలరించాయి. అంతకు ముందు కలెక్టరేట్ ఆవరణలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు.

స్వదేశి దర్శన్ 2.0 ప్రాజెక్ట్ లో భాగంగా అరకు - లంబసింగి టూరిస్ట్ డిస్టినేషన్‌లోగో ను సబ్ కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. లంబసింగి, అరకు గిరిజన సంప్రదాయాలను, కొండ ప్రాంతాలను, కాఫీ, ఇరియాలు, ఇతర వ్యవసాయ పంటలు, జలపాతాలు అడ్వంచర్ టూరిజం మొదలైన అంశాలు ప్రస్ఫుటించే విధంగా లోగోను రూపొందించిన టూరిజం ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కె. రతన్ రాజును పలువురు అభినందించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురష్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు, ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ సభ్యులు కిల్లు రమేష్ నాయిడు, ఎంపిటిసి విజయలక్ష్మి, అనంతగిరి సర్పంచ్ రమణమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీ రావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్బిఎస్ నంద్, జిల్లా ఉద్యాన శాఖాధికారి పి.రమేష్ కుమార్ రాజు, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి అప్పారావు, టూరిజం ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కె.రతన్ రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

గిరిజన సంఘం వైద్య శిబిరాలు విజయవంతం

- రెండో రోజు గుమ్మిరేవుల, దారకొండ పంచాయతీల్లో 200 మందికి వైద్యం
- వైద్య సేవలు అందించిన మెడికవర్ డాక్టర్లు
- ప్రజారోగ్య వేదిక, శారదా ట్రస్టు, అల్లూరి విజ్ఞాన కేంద్రం సహకారంతో నిర్వహణ

వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, హాజరైన గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే.వీధి మండలంలో ఇటీవల వరద బీభత్సానికి గురైన గాలికొండ, దారికొండ, గుమ్మిరేవుల పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు వైద్య సేవలు నిమిత్తం ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన రెండు రోజుల పాటు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాలు విజయవంతమయ్యాయి. ప్రజారోగ్య వేదిక, శారద ట్రస్ట్, అల్లూరి విజ్ఞాన కేంద్రం సహకారంతో మెడికవర్ హాస్పిటల్స్ డాక్టర్లు ఈ శిబిరాల్లో వైద్య సేవలు అందించారు. రెండో రోజు శుక్రవారం గుమ్మిరేవుల పంచాయతీ చోడురాయిలో మెగా వైద్య శిబిరం జరిగింది. గుమ్మిరేవుల పంచాయతీ పరిధి మాదిగమల్లు, చోడురాయి, కొత్తూరు కోట, చింతగుప్ప, గొర్రిలోవ, అన్నవరం, కిల్లోగుడ, దారకొండ పంచాయతీ చీడిగుంట, కమ్మరితోట, తోకరాయి, నిమ్మచెట్టు తదితర గ్రామాలకు చెందిన 200 మంది గిరిజనులు వైద్య శిబిరానికి హాజరయ్యారు. వారికి మెడికవర్ వైద్యులు డాక్టర్ జి.భాగ్యరాజు (ఫిజీషియన్) డాక్టర్ వి.కిరణ్ కుమార్ (గుండె వైద్య నిపుణులు) వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. జ్వరం, ఒళ్ల నొప్పులు, కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు కామేశ్వరరావు మాట్లాడుతూ చోడురాయి, మాదిగమల్లు గ్రామాలను తాము పరిశీలించామని, భారీ వర్షాలు, వరదలకు పంట పొలాలు, ఇళ్లు, భూములు, తిండిగింజలు సర్వం కొట్టుకుపోయి కట్టు బట్టలతో మిగిలారని తెలిపారు. వారికి జరిగిన నష్టాన్ని తమ వద్ద మొరపెట్టుకొని కన్నీరుమున్నీరుగా విలపించారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారందరిని ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారీ వర్షాల వల్ల మారుమూల గ్రామాల్లో గిరిజనులు పలు రోగాల బారిన పడ్డారని, వారికి వైద్య సేవలు అందించాలని దృక్పథంతో ఈ వైద్య శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచే వర్షం కురిసినా చుట్టుపక్కల గ్రామాల నుండి గిరిజనులు అధిక సంఖ్యలో వైద్య శిబిరానికి హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జి.సత్యనారాయణ, గాలికొండ ఎంపీటీసీ, సిపిఎం మండల కార్యదర్శి ఎ.బుజ్జిబాబు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు బాకూరి కోటేశ్వరరావు, పాంగి నాగేశ్వరరావు, కిల్లో బాబురావు, గుమ్మిరేవుల మాజీ సర్పంచ్ పూజారి బాబురావు, ఆశా కార్యకర్త కొల్లూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఉపాధ్యాయులందరూ అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వ, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకు కొండలరావు ఆదేశించారు. స్థానిక కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయం, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం డిడి కొండలరావు ఆకస్మికంగా సందర్శించారు. కేజీబీవీలో విద్యార్థులకు పాఠాలు బోధించి ప్రశ్నలు వేసి వారి చేత జవాబులు చెప్పించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు గణితంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు భయాన్ని విడనాడి విద్యను అభ్యసించాలని, పాఠాలు అర్థం కాకుంటే ఉపాధ్యాయులతో మళ్లీ పాఠాలను చెప్పించుకొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం జరిగిన స్టాఫ్ మీటింగ్‌లో డిడి మాట్లాడుతూ విద్య ప్రమాణాలు పెంచడానికి ఉపాధ్యాయులకు సలహాలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.రామారావు, ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఎస్ కుమార్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్ చిన్నారెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపల్ మయూరి లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ డిడి కొండలరావు

ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించండి

డిఎం అండ్ హెచ్ఒకు వినతి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా లోని ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా కు శుక్రవారం గిరిజన ప్రాంత వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2019 సంవత్సరం నుండి నేటి వరకు ఆర్‌సిహెచ్ ట్రాకింగ్ అమౌంటు చెల్లించలేదన్నారు. 2021 సంవత్సరం నుండి ఏవిడి అమౌంటు చెల్లించలేదని తెలిపారు. 2020 సంవత్సరం నుండి ఎఫ్‌టిఎలు ఇవ్వలేదన్నారు.అడల్ట్ డిసిసి వ్యాక్సిన్ అమౌంటు నేటి వరకు చెల్లించలేదని, ఎస్ఆర్‌లు అప్డేట్ చేయడంలో సీనియర్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇంక్రిమెంట్స్ మార్చే విషయంలో కూడా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.ఈ సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు పుష్ప, రమాప్రభ, భాగ్యవతి, భవాని, విజయ, కొండమ్మ, చంద్ర, పూర్ణ కోరారు.

అస్తవ్యస్తంగా ఉన్న కోనాపురం రోడ్డు

రాళ్లు తేలిన రహదారులతో అవస్థలు

ప్రజాశక్తి -అనంతగిరి: ఇవి మట్టి రోడ్డు అనుకుంటే పొరపాటు పడినట్టే. గత 15 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వ హాయంలో బీటి రోడ్డు నిర్మించారు. రెండవ దపా తారు వేయకపోవడంతో మరమ్మతులకు గురై వర్షాలకారంగా కోతకు గురై గోతులుగా ఏర్పడి మట్టిరోడ్డులా తలపిస్తున్నాయి. ఇదీ కోనాపురం రోడ్డు పరిస్థితి. అనంతగిరి మండలం బొర్రా, కోనాపురం పంచాయతీలతో పాటు అరకు మండలం గన్నేల, లోతెరు, ఇరిగాయి పంచాయతీల ప్రజలు ఈ రోడ్డు మీదుగా ఎస్.కోట, విశాఖ, విజయనగరం ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలకు వెళుతుంటారు.తక్కువ సమయంలో ప్రయాణం కలిసి వస్తుడటంతో ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారు. బొర్రా గేటువలస మొదలు కొని చప్పాడి, కోనాపురం, కితలంగి అత్తిమాల, కరయిగుడ మీదుగా లోతేరు మెయిన్ రోడ్డు వరకు 15 కిల్లో మీటర్ల పైగా ఉంటుంది. గత కొన్నేళ్ల నుండి గోతులమయంగా ఏర్పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కురిసిన భారీ వర్షాలకు వేసిన తారు కోతకు గురై రోడ్డంతా మట్టి రోడ్డులా తయారయ్యింది. ఎన్ని ప్రభుత్వాలు మారినప్పటికీ కనీసం ఈ రోడ్డు మరమ్మతు పనులు చేపట్టిన పాపాన పోలేదు. ఎన్ని సార్లు ఆయా గ్రామాల ప్రజలు ఈ సమస్యపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న నాదుడే కరువయ్యారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షాలతో రహదారులు ఛిద్రం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో కురుస్తున్న వర్షాలతో గిరిజన గ్రామాల రోడ్లు కోతకు గురై రాకపోకలకు అంతరం ఏర్పడుతోంది. అనంతగిరి పంచాయతీ రాజుపాక, మాలింగవలస మీదుగా పాతకొట, రేగం, నందిగుమి, వాలసి పంచాయతీ ఊటగెడ్డ, పుట్టపాడు లుంగపర్తి పంచాయతీ నేలపాలేం నుండి ఓనుకొండ ఎగువపటి మీదుగా కివర్ల పంచాయతీ బొంగిజా, పూతికపుటు, జగడలమాడి తదితర మట్టి రోడ్లు వర్షానికి కోతకు గురయ్యాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి శాశ్వత రోడ్డు మార్గాలు ఏర్పాటు గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బురదమయ మార్గాన అవస్థలు పడుతున్న వాహనదారుడు

స్వర్ణాంధ్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని బూర్జ పంచాయతీ పరిధిలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న స్వర్ణాంధ్ర కార్యక్రమం వాల్ పోస్టర్లను జనసేన నాయకులు ఆవిష్కరించారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా పలు రకాల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వం చేపట్టిన పలు రకాల కార్యక్రమాలను ప్రజలకు వివరించి అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరిస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ హుకుంపేట మండల ఉపాధ్యక్షులు మజ్జి కృష్ణం రాజు, బుద్దు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వరద పరిహారంలో అవకతవకలపై నిరసన

విఆర్ఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని వడ్డిగూడెం పంచాయతీ పరిధి వడ్డిగూడెం గ్రామంలో వరదలకు నష్టపోయిన ఇళ్లకు అందించే పరిహారంలో జరిగిన అవకతవకలపై ఆ గ్రామస్తులు స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట శుక్రవారం గంటపాటు నిరసన కార్యక్రమం చేపట్టారు. వరదల్లో దెబ్బతిన్న ఇళ్లకు ఇచ్చే రూ.10వేలు పరిహారం స్థానిక విఆర్ఓ తమకు ఇవ్వలేదని, దీనిపై విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని వారు తహశీల్దారు ఎస్.సుబ్బారావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా వరదల వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నా తమ ఇళ్ల పరిహారం ఇవ్వకపోవడం దారుణమన్నారు. స్థానిక వ్యక్తిని ఇక్కడ విఆర్ఓగా నియమించడం వల్ల ఈ వివాదాలు జరుగుతున్నాయని, ఆయన్ను బదిలీ చేయాలని, విఆర్ఓపై కఠిన చర్య తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన తహశీల్దారు సుబ్బారావు మాట్లాడుతూ తగిన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లోళ్ళ ప్రసాద్, కర్నాటి రాంబాబు, ముత్యాల శ్రీరామ్మూర్తి, పొడ్తూల శంకర్‌రావు, పొడ్తూల నరసింహరావు, బాగుల అంజనరావు, నాళ్లరపు రాజు, ముత్యాల శివకుమార్, దాసుకొండ రాజు, రామగిరి రమణయ్య, ముత్యాల సురేష్, పిడుగు నాగేంద్ర పాల్గొన్నారు.

ఆందోళనకారులతో మాట్లాడుతున్న తహశీల్దారు సుబ్బారావు

ఉద్యోగ భద్రత కల్పించాలని వాలంటీర్ల ఆందోళన

ప్రజాశక్తి- కూనవరం

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతు గ్రామ వాలంటీర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి, ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షులు కొమరం పెంటయ్య మాట్లాడుతూ వాలంటీర్లకు ఉద్యోగాల భద్రత కల్పించాలని, పెండింగ్లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని కోరారు. రాజీనామా చేసిన వారిని తిరిగి కొనసాగించాలని, వాలంటీర్లకు కూటమి ఇచ్చిన వాగ్దానం మేరకు వేతనాలు రూ.10వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి చిచ్చడి మహేష్, అధ్యక్షులు సోందే పద్మ, కోశాధికారి మడకం రవి, పెద్ద సంఖ్యలో వాలంటీర్లు పాల్గొన్నారు.

ధర్నా అనంతరం వినతిపత్రం అందిస్తున్న వాలంటీర్లు

నేడు, రేపు పర్యాటక ప్రదేశాలు మూసివేత

ప్రజాశక్తి-రంపచోడవరం

భారీ వర్షాలు కారణంగా ఈ నెల 28, 29 (శని, ఆదివారాలు) తేదీల్లో ఏజెన్సీలోని పర్యటక ప్రాంతాలను మూసి వేస్తున్నామని, పర్యటకులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ప్రధానంగా వాటర్ ఫాల్స్‌కు అనుమతి లేదని తెలిపారు. పర్యటక ప్రాంతాలకు వచ్చే టూరిస్టులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాగులు పొంగే ప్రమాదం ఉన్నందున వివిధ గ్రామాలలో కాలినడకన కాలువలు దాటవద్దని సూచించారు.

బదిలీ అధికారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

అటవీశాఖలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న సబ్ డిఎఫ్ఒ బి.శ్రీరామారావు, రాజవొమ్మంగి రేంజర్ ఎం.అబ్బాయిదొర, ఎఫ్ఎస్ఓ శిల్ప, రైటర్ మధుబాబు తదితరులను రాజవొమ్మంగి రేంజ్ అటవీ శాఖ సిబ్బంది స్థానిక రేంజ్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓలు పి రాము, సుబ్బయ్యమ్మ మాట్లాడుతూ శ్రీరామారావు, అబ్బాయిదొర విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేశారని, వారి సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఓలు ప్రసాద్ రెడ్డి, ఆనంద్, నాగేశ్వరరావు, మహేష్, లక్ష్మి, రామకృష్ణ, అప్పారావు, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులను సత్కరిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా యుటిఎఫ్ క్రీడా పోటీలు

క్రీడా పోటీలకు వచ్చిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకొని కిల్లోగూడ ఆశ్రమ పాఠశాల గ్రౌండ్‌లో శుక్రవారం క్రీడా పోటీలు నిర్వహించారు. నగేష్ మాస్టారు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఊపి ఆటల పోటీలను ప్రారంభించారు. క్రీడా పోటీలలో వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాట్మెంటన్, మహిళా ఉపాధ్యాయులకు కబడీ, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, క్యారం బోర్డ్ క్రీడలను నిర్వహించారు. ఉపాధ్యాయులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు మాట్లాడుతూ, మహిళా ఉపాధ్యాయులు క్రీడలలో భాగస్వాములు కావడం ఆనందదాయకమన్నారు. ఉపాధ్యాయులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. సర్కారు పాఠశాలలను కాపాడే లక్ష్యంతో యుటిఎఫ్ పనిచేస్తుందని తెలిపారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణ, అధ్యక్షులు కే.రాజారావు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్ కన్నయ్య, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎల్ నారాయణ, సీనియర్ ఉపాధ్యాయ నాయకులు ఎం బాబురావు, కార్యదర్శులు దుక్కు ప్రసాద్, మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో చాత్రోపాధ్యాయులు రూపొందించిన 'స్వర్ణాంధ్ర @ 2047' పోస్టర్‌ను శుక్రవారం ప్రిన్సిపాల్ ఎం జ్యోతికుమారి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, వికసిత భారత్ లక్ష్యంగా 2047నాటికి దేశాన్ని వివిధ రంగాల్లో అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని, దీనికి సంబంధించిన ప్రణాళికల రూపకల్పనలో ఛాత్రోపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు జిజిఎస్ నాగేశ్వరరావు, జి రవి, విశ్వేశ్వరయ్య, పి హరిణి, డాక్టర్ ఆర్ నీలిమ పాల్గొన్నారు

ఘనంగా అక్కినేని శతజయంతి

ప్రజాశక్తి-సీతమ్మధార : దాదాసాహెబ్ ఫాల్కే అవార్డ్ గ్రహీత, సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని శుక్రవారం విశాఖ పౌర గ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు అక్కినేని చిత్రపటానికి ఎస్‌కె.మిశ్రో, సుజాత, డి.భూపతిరావు, నరవ ప్రకాశరావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం వైజాగ్ ఫిలిం సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షతన జయంతి సభలో వక్తలు మాట్లాడుతూ అక్కినేని జీవితం తెరిచిన విజ్ఞాన సర్వస్వమని, అది నేటితరానికి మార్గదర్శకమన్నారు. తెలుగు సినిమా ఉన్నంతవరకు అక్కినేని చిరస్మరణీయుడని కొనియాడారు ఎఎన్‌ఆర్‌తో తమకున్న అనుబంధం, అనుభవాలను గుర్తు చేశారు. అక్కినేని నటించిన చక్రవర్తి సినిమాను ప్రదర్శించారు. చిత్రసమీక్ష చేశారు. కార్యక్రమంలో బి చిన్నారావు, హుస్సన్, డాక్టర్ బాబ్జి, చాట్ల బాబూరావు, రెడ్డి ఉషారాణి పాల్గొన్నారు

నేడు సన్యాసిరావు సంతాపసభ

ప్రజాశక్తి -గాజువాక : ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు గంగిరెడ్డి సన్యాసిరావు సంతాప సభ ఈనెల 28న శనివారం జగ్గు సెంటర్ సమీపంలోని లయన్స్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభం కానున్న సంతాప సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజ శర్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు తదితరులు హాజరౌతారన్నారు

ఇష్టపడి చదివితే అద్భుత విజయం

పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ - ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన టెట్, డిఎస్‌సి స్టడీ మెటీరియల్ పంపిణీ

స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

ప్రజాశక్తి- పాడేరు: అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు శాసనమండలి సభ్యులు కే.ఎస్ లక్ష్మణరావు రూపొందించిన (విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం) టెట్, డీఎస్సీ ఉచిత మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు ధర్మన్నపడాల్ అధ్యక్షతన చేశారు. డీఎస్సీ ఉచిత మెటీరియల్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాడేరు రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ హాజరయ్యారు. ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర తో కలిసి ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణి చేశారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఇష్టపడి చదివితే డిఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు సాధించవచ్చన్నారు. నేటి పోటీ ప్రపంచంలో నిరుద్యోగులు ప్రణాళిక ప్రకారం కృషి చేయాలని సూచించారు. ప్రతిభ ఎవరికీ సొంతం కాదని తెలిపారు. గెలుపు, ఓటములు సహజమేనని, అదే సందర్భంలో విజయ సాధన కోసం నిత్యం కృషి చేయడం మంచిదని తెలిపారు. స్టడీ మెటీరియల్స్ పంపిణి చేస్తున్న ఆదివాసి గిరిజన సంఘం కృషిని అభినందించారు

ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స మాట్లాడుతూ, జనరల్ డిఎస్సీలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, ఆదివాసీ ప్రత్యేక డిఎస్సీ సాధన కోసం ఉద్యమం చేయాలని కోరారు. ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసి నిరుద్యోగులు వేల సంఖ్యలో ఉన్నారని, జనరల్ డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఆదివాసులకు న్యాయం జరగదన్నారు. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయాలని చెప్పారు జీవో 3కు చట్టబద్ధత కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యంత్రి హామీ ఇచ్చారని, నేటికీ రాష్ట్ర కేబినెట్ 6 సార్లు సమావేశం ఏర్పాటు చేశారని ఈ అంశాన్ని కనీసం చర్చించలేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతాల్లో వివిధ శాఖల్లో ఆదివాసీ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. జిల్లా కార్యదర్శి పి. బాల్ దేవ్ మాట్లాడుతూ, 5వందల మంది ఆదివాసీ నిరుద్యోగులకు ఉచితంగా టెట్, డిఎస్సీ స్టడీ మెటీరియల్ పంపిణి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ మాతృ భాష విద్యా వాలంటరీ సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీను, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్, వరహాల బాబు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు చిట్టిబాబు, సత్యనారాయణ, కృష్ణారావు పాల్గొన్నారు.

2న ప్రజా ఉద్యమ ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సీతమ్మధార: విశాఖ ఉక్కు రక్షణకు ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ వచ్చేనెల 2న నిర్వహించే ప్రజా ఉద్యమ ర్యాలీని విజయవంతం చేయాలని రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి పిలుపునిచ్చారు. ఆ రోజున డాబాగార్డెన్స్ నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు నిర్వహించే ర్యాలీలో రాజకీయాలకు అతీతంగా పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. శుక్రవారం ద్వారకానగర్‌లో విశాఖ సిటిజన్ ఫోరం మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఒక క్రమపద్ధతిలో ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం యత్నిస్తోందని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉత్తరాంధ్ర ప్రజలపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వ పాలకులు కేంద్రం చర్యలను వ్యతిరేకించకుండా తలాడిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పథకాలకు, పాలనకు లక్షల కోట్లు అప్పులు చేస్తున్నారని, అందులో రూ.పదివేల కోట్లను కేటాయించి, సొంతగనులు కేటాయిస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ లాభాలబాట పడుతుందన్నారు. కానీ కేంద్రప్రభుత్వం అలా చేయకుండా, కావాలనే ప్రయివేటుకు ధారాదత్తం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. ఇందులో భాగంగానే 2500మంది ఉద్యోగులకు విఆర్ఎస్ ఇస్తామని, మరో 500మందికి ఛత్తీస్‌గఢ్‌కు బదిలీ చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. ఎన్నో త్యాగాలతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును నాటి ప్రధాని పివి.నరసింహారావు జాతికి అంకితం చేశారని, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ మెడలు ఒంచైనా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ ఉద్యమాలకు ప్రజల నుంచి స్వచ్ఛంద మద్దతు ఉందని గుర్తు చేశారు. విశాఖ సిటిజన్ ఫోరం గౌరవ అధ్యక్షులు పి వెంకటరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వ ఉబలాట చర్యలను కార్మికులతో పాటు అన్ని వర్గాల ప్రజలు చైతన్యమై అడ్డుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ చేస్తున్న ఉక్కు రక్షణ ఉద్యమానికి విశాఖ సిటిజన్ ఫోరం మద్దతునిస్తుందన్నారు. సమావేశంలో ఫోరం అధ్యక్షులు పిఎస్ తిలక్, కార్యదర్శి పి. రామకృష్ణ, కోశాధికారి పి రాము పాల్గొన్నారు.

అవయవ, దేహదానంపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : అవయవ, దేహదానంపై అఖిల భారత అవయవ దాతల సంఘం, సావిత్రీభాయి పూలే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి అవగాహన కల్పించారు. శుక్రవారం స్థానిక సన్ స్కూల్‌లో సంబంధిత వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

.ఈ సందర్భంగా ఆమెమాట్లాడుతూ ప్రతిఒక్కరూ అపోహలు వీడి, అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. అవయవ, దేహదాన చేయడం ద్వారా మరణించిన తర్వాత కూడా జీవించవచ్చని, అలాగే నలుగురి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన, చైతన్య కలిగించేందుకు స్థానిక నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ముందుకు రావడాన్ని అభినందించారు. నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు రూ 5 వేలు చెక్కును సీతామహాలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జి కన్యాకుమారి, ఐ సురేఖ, నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎం.సూర్య శ్రీనివాస్, కె సన్నీ, ఆర్ బసవ కృష్ణమూర్తి, కె సురేష్‌కుమార్, అరుణ్ కుమార్, సన్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు

30న మహాధర్నాను జయప్రదం చేయాలి

-సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్

కార్మికులకు కరపత్రాలు ఇస్తున్న చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి-చింతపల్లి: కార్మికుల సమస్యలపై ఈనెల 30న చేపట్టే చలో కలెక్టరేట్ మహా ధర్నాను అన్ని విభాగంలో పనిచేస్తున్న కార్మికులు తరలివచ్చి జయప్రదం చేయాలని సిఐటియు అల్లూరు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపు నిచ్చారు. మండలంలోని, ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ కార్మికులకు చలో కలెక్టరేట్ కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, సెక్యూరిటీ హౌస్ కీపింగ్‌తో సహా అన్ని శాశ్వత పనుల్లో పర్మినెంట్ కార్మికులు మాత్రమే పనిచేసే విధానం అమలు చేయాలన్నారు. సరళీకరణ విధానాల పేరుతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కార్మికులను పర్మినెంట్ చేయలేదన్నారు. బిజెపి మోడీ పాలనలో 'నో పర్మినెంట్ సిద్ధాంతాన్ని ఆర్మీతో సహా పక్కాగా అమలు చేస్తున్నారని విమర్శించారు. కార్మికులను యాజమాన్యాలు పర్మినెంట్ చేయలేదన్నారు. గత 30 సంవత్సరాల పైగా పాలకులు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. బిజెపి మోడీ నాయకత్వంలో పెట్టుబడిదారీ, మతోన్మాద, కార్మిక కర్షక వ్యతిరేక పాలన కొనసాగుతోందన్నారు. కార్పొరేట్లు ఏది కోరితే దాన్ని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్పొరేట్లకు లక్షల కోట్లకు పైగా రాయితీలు ఇచ్చారని మండిపడ్డారు. కార్మికులు పోరాడి హక్కులు సాధించుకోవాలని, ఇందులో భాగంగానే ఈనెల 30న దేశవ్యాప్తంగా కార్మిక శ్రామిక వర్గం తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఫారెస్ట్, ఆస్పత్రి, ఐటీడీఏ శాఖలతో సహా వివిధ విభాగాల్లోని కార్మికులంతా తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, కొర్ర నాగేశ్వరరావు, రాజేశ్వరి, అర్జున్‌రావు పాల్గొన్నారు.

బోస్ స్టాటిస్టిక్స్‌పై గీతంలో వర్క్‌షాప్

అతిథులను సత్కరిస్తున్న గీతం వర్సిటీ ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : ప్రపంచ ప్రసిద్ధి చెందిన భారతీయ భౌతికశాస్త్ర శాస్త్రవేత్త సత్యేంద్రనాద్ బోస్ వందేళ్ల కిందట పరిశోధించిన బోస్ స్టాటిస్టిక్స్‌పై ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, కలకత్తాకు చెందిన సత్యేంద్రనాద్ బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో బాబా అణుశక్తి పరిశోధన కేంద్ర విశిష్ట శాస్త్రవేత్త ప్రొఫెసర్ బిఎన్.జగతాప్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అశోక ఎస్.ఉదయగిరి, సత్యేంద్రనాద్ బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిక్ సైన్సెస్ శాస్త్రవేత్తలు మణిక్‌బనిక్, తిరుపతయ్య శెట్టి పాల్గొని వివిధ రంగాలలో బోస్ స్టాటిస్టిక్స్ ప్రాధాన్యతను వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ అధ్యక్షత వహించి, సత్యేంద్రనాధ్‌బోస్ పరిశోధనలు నేడు భౌతిక శాస్త్ర అధ్యాయనాలలో ఎలా ఉపయోగపడుతున్నాయో వివరించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేదవతి, మూర్తి ప్రయోగశాలల విశిష్ట ప్రొఫెసర్ జి.రవికుమార్ నగరంలోని వివిధ కళాశాలల భౌతిక శాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రత్నమాణిక్యం

స్వర్ణాంధ్ర విజన్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-చింతూరు : స్వర్ణాంధ్ర-2047 విజన్‌పై స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం, చరిత్ర విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు, పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నారు. విద్యాపరమైన అభివృద్ధితోపాటు పర్యాటక రంగంపై దృష్టి సారించి విదేశీ యాత్రికులకు ఆహ్వానం పలికి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా విదేశీ మారకద్రవ్యం లభిస్తుందని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ పర్యాటక రంగంగా అభివృద్ధి చెందితే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.సాయికుమార్ మాట్లాడుతూ 2047 నాటికి ఆంధ్ర ప్రదేశ్ భారతదేశంలోనే నెంబర్ వన్ టూరిజం రాష్ట్రంగా వెలుగొందాలన్నారు. అనంతరం ఏజెన్సీ ప్రాంత సంప్రదాయ నృత్యాలు, ప్రసిద్ధమైన థింసా నృత్యంతో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి బి.శ్రీనివాస్ అధ్యాపకులు జి. వెంకటరావు, ఆర్‌సిహెచ్ నాగేశ్వరరావు, వై.పద్మ,కె. శకుంతల, జి.హారతి, ఎస్.అప్పనమ్మ, కె.శ్రీలక్ష్మి, కె.శ్రీదేవి, ఆర్.మౌనిక, పి.అలివేలు, బి ప్రకాష్, సుభద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం కొమ్మిక స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్న ముగ్గురు ఉపాధ్యాయులకు శుక్రవారం కొమ్మిక బాలికల ఆశ్రమ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కొమ్మిక స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని బాలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాత బాలారం, కంటారం పాఠశాలల ఉపాధ్యాయులు కన్నారావు, తలుపులు జిల్లా స్థాయిలోనూ, శకుంతల మండల స్థాయిలోనూ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇటీవల అవార్డులు అందుకున్నారు. ఈ నేపథ్యంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సంధ్య ఆధ్వర్యంలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులందరూ కలిసి వారిని సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంబాబు, పిఆర్‌టియు అసోసియేషన్ ప్రెసిడెంట్ నేతల నారాయణరావు, ఏపీటీఎఫ్ మండల సెక్రటరీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం సెక్టార్ పరిధిలో ఉన్న లూసం, చౌడుపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు శుక్రవారం ఘనంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో విజయ కుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.

స్వచ్ఛత, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఒక్కరూ స్వచ్ఛత, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇగ్నో ఉప సంచాలకులు డాక్టర్ ఇ.కృష్ణారావు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల అన్నారు. భారత ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం, ప్రభుత్వ విశాఖ మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో స్వచ్ఛత, వ్యక్తిగత పరిశుభ్రతపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులంతా స్వచ్ఛతా సేవాలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

వేడుకల్లో పాల్గొన్న పిఒ అభిషేక్ తదితరులు

ప్రజాశక్తి - అరకులోయ : ప్రపంచ పర్యాటక దినోత్సవం వేడుకలను ప్రముఖ పర్యాటక కేంద్రం అరకు వ్యాలీ లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మ్యూజియంలో నిర్వహించిన పర్యాటక కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి అభిషేక్, ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అల్లూరి జిల్లా ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకువేలి నందు ఐటిడిఏ టూరిజం సంబంధిత గిరిజన మ్యూజియం, పద్మాపురం బొటానికల్ గార్డెన్, గిరి గ్రామదర్శిని, చాపరాయి కొల్లాపుట్టు, మొదలైన అన్ని యూనిట్ల నుండి సంబంధిత సిబ్బంది అరకు వేలిలో గల వివిధ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, బోధన సిబ్బందితో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పర్యాటకులు, స్థానికులతో గిరిజన మ్యూజియం ప్రధాన రహదారి నుండి మొదలుకొని సాంప్రదాయ దింసా నృత్యంతో అలరిస్తూ ర్యాలీ చేశారు. గిరిజన మ్యూజియంలో మర్రి కామయ్య కళావేదిక నందు పర్యాటకులు, కళాశాల విద్యార్థులు అనేక రకాల స్కిట్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ అధికారులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా డిప్యూటీ తహశీల్దారు బాలాజీ ఆధ్వర్యంలో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మారేడుమిల్లి పురవీధుల్లో శుక్రవారం ర్యాలీ నిర్వహించి, స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్లో మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డిటి ప్రపంచ పర్యాటక దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. పర్యాటక ప్రదేశాలకు వెళ్లేవారు ప్రకృతి అందాలను ఆస్వాదించాలి తప్ప, ప్రాణాల మీదకు తెచ్చుకోరాదని హితవుపలికారు. పర్యటక ప్రాంతాలను ప్లాస్టిక్ వ్యర్థాలతో నింపరాదన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి పి.జయంతి, ప్రధానోపాధ్యాయులు రామారావు, పిడి సుదర్శనరావు, ఆర్ఐ ఏసుబాబు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల ప్రిన్సిపల్, పీడీలపై చర్యలు తీసుకోవాలి

ఎపి గురుకులం డిప్యూటీ సెక్రటరీకి ఆదివాసీ గిరిజన సంఘం నేతల వినతి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ఎపి గురుకుల బాలికల కళాశాల విద్యార్థులపై నిరంకుశంగా ప్రవర్తించిన ప్రిన్సిపాల్ బి.ప్రసూన, పీడీలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం నాయకులు మట్ల వాణిశ్రీ, ఈ.సిరిమల్లిరెడ్డి, బి.రత్న కుమారి గురువారం అమరావతిలోని ఏపీ గురుకుల డిప్యుటీ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు మాట్లాడుతూ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, పీడీ విద్యార్థినులపై నిరంకుశంగా ప్రవర్తించటమే కాకుండా వారి చేత 100 నుండి 300 గుంజీలు తీయించి 320 మంది విద్యార్థినుల అనారోగ్యానికి కారణమయ్యారని తెలిపారు. ఈ విషయాలు బయటకు తెలియకుండా ఉండేందుకు విద్యార్థినులను బెదిరించారన్నారు. ఇలాంటి అధికారుల వల్ల ఆడపిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదముందని పేర్కొన్నారు.

తక్షణమే చర్యలు తీసుకోవలసిన ఐటిడిఎ అధికారులు కూడా ప్రిన్సిపాల్‌ని సపోర్ట్ చేసి, హాస్పిటల్ చికిత్స పొందుతున్న విద్యార్థినులను తిట్టారని ఆరోపించారు. వేధింపులకు గురిచేస్తున్న అధికారులకు ఉన్నతాధికారులు కొమ్ము కాస్తుంటే విద్యార్థుల బాధలు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి ప్రిన్సిపాల్ బి.ప్రసూన, పీడీలను విద్యా హక్కు చట్టప్రకారం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థినుల తల్లిదండ్రులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులపాటు గీతం యూనివర్సిటీ వేదికగా నిర్వహించనున్న ఎపి స్టేట్ టేబుల్ టెన్నిస్ పోటీలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గీతం యూనివర్సిటీ అధ్యక్షులు, పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ హాజరై పోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 425 మంది క్రీడాకారులతో పాటు 25 మంది అఫీషియల్స్, అంతర్జాతీయ అంపైర్లు, కోచ్‌లు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి డాక్టర్ డివిఎస్‌వై.శర్మను శ్రీభరత్ సన్మానించారు.

గండ్లును పూడుస్తున్న గిరిజనులు

శ్రమదానంతో కల్వర్టు గండ్లు పూడ్చివేత

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి కొంగపాకల, పెంట్ల గెడ్డ, డి.కొత్తూరు గ్రామాలకు వెళ్లే మార్గంలో గెడ్డపై ఉన్న కల్వర్టు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోగా, ఆ గ్రామాల గిరిజనులు శుక్రవారం శ్రమదానం చేసి రాళ్లతో కల్వర్టుకు ఇరువైపులా పడిన గండ్లను పూడ్చారు. ఈ నెల 7, 8 9 తేదీల్లో వరద బీభత్సానికి ఇక్కడ కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇది జరిగి 20 రోజులుగా దాటినా ఇప్పటివరకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో గత్యంతరం లేక గ్రామస్తులు శ్రమదానంతో తాత్కాలికంగా బాగు చేసుకుందామని భావించారు. శుక్రవారం కొట్టుకుపోయిన కల్వర్టుకు ఇరువైపులా పడిన గండ్లను బండరాళ్లతో పూడ్చారు. వంతెన కింద భాగంలో అడ్డంగా ఉన్న మట్టి, రాళ్లు, చెత్తాచెదారం, దుంగలు తొలగించారు. ఈ రహదారిలో ప్రయాణానికి ఇబ్బంది లేకుండా గండ్లను పెద్ద పెద్ద రాళ్లతో పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కల్వర్టు కొట్టుకుపోవడంతో వైద్య సేవలు పొందడానికి ఇబ్బందికరంగా మారిందన్నారు. ఇటీవల పలువురు మలేరియా డెంగ్యూ తదితర వ్యాధుల బారిన పడితే వారిని తీసుకెళ్లడానికి అంబులెన్స్ రాలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు ఉపాధ్యాయులు రావాడానికి కూడా కష్టంగా మారిందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతు పనులు చేపట్టి రాకపోకలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రహదారి క్లియరెన్స్ పనులు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ దార్లగొంది - మలసలవీధికి వెళ్లే రహదారిపై ఇటీవల వరదలకు కొండ చరియలు విరిగి పెద్దపెద్ద బండరాళ్లు, మట్టి భారీగా పేరుకుపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో దారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు శుక్రవారం జెసిబి సహాయంతో రహదారి క్లియరెన్స్ పనులు చేపట్టారు. రహదారికి అడ్డంగా పడిన పెద్ద పెద్ద బండ రాళ్లు, మట్టిని తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాలు మేరకు ఈ పనులు చేపట్టినట్లు చెప్పారు.

గృహ నిర్మాణాలపై అవగాహన సదస్సులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : 2016 నుండి 2022 వరకు మంజూరైన గృహలను పూర్తిస్థాయిలో నిర్మించేందుకు వీలుగా గ్రామాల్లో లబ్ధిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి జాన్‌రాజ్, స్థానిక ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో యాదగిరిశ్వరరావు అధ్యక్షతన మనఇల్లు-మన గౌరవం అనే కార్యక్రమం గూర్చి పంచాయతీ ప్రత్యేక అధికారులు, హౌసింగ్ ఏఈ, వర్క్ ఇన్స్పెక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌రాజ్, యాదగిరిశ్వరావు మాట్లాడుతూ వివిధ దశల్లో ఉన్న గృహాలను 2025 మార్చి 31 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో, ఈ నెల 28న లబ్ధిదారులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐగా రమేష్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు ఎస్సైగా పి.రమేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రమేష్ పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడే విషయంలో ఎప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని చెప్పారు.